## క్లుప్తంగా

### గుత్తి కోటలో పర్యాటకుల సందడి



గుత్తి కోటలో డ్యాన్స్ చేస్తున్న పర్యాటకులు

గుత్తి: చరిత్రాత్మకమైన గుత్తి కోటకు పర్యాటకుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో ఆదివారం పర్యాటకులు తరలి వచ్చి గుత్తి కొండ లోని చారిత్రక కట్టడాలను వీక్షించారు. ముఖ్యంగా రైల్వే కుటుంబాలు అధికంగా వచ్చాయి. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, గైడ్ రమేష్ కోట చరిత్రను, ప్రాముఖ్యతను పర్యాటకులకు వివరించారు. పర్యాటకులు ఆనందంతో డ్యాన్స్‌లు, యోగా చేశారు. ఎంతో ఆనందంగా గడిపారు.

### 'షైనింగ్ స్టార్'కు ఆరుగురి ఎంపిక

యాడికి: మండలంలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచిన ఆరుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ కార్యక్రమానికి ఎంపికైనట్లు మండల విద్యాధికారి కాశెప్ప ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వాగ్దేవి పాఠశాలకు చెందిన విద్యార్థులు సోహిత, లిఖిత, హరణి, లోహిత, వైష్ణవి, ప్యారడైజ్ పాఠశాలకు చెందిన తేజ ఎంపికయ్యారన్నారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థులు సోమవారం మధ్యాహ్నం 2గంటలకు అనంతపురంలోని జీఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌కు వెళ్లాలని ఎంఈఓ కాశెప్ప తెలిపారు.

### అండగా ఉంటాం..



జెడ్పీటీసీ శోభను పరామర్శిస్తున్న నైరుతిరెడ్డి

పామిడి: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతిరెడ్డి అన్నారు. ఆదివారం ఆమె మండలంలోని జెడ్పీటీసీ శోభ, కార్యకర్తలు 4వవార్డు ఓబులేసు, అంబేడ్కర్ కాలనీ శ్రీనివాస్ ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. బాధిత ఓబులేసుకు ఆర్థికసాయం అందించారు. అంతకు ముందు ఆమె పట్టణంలోని కోగటం ఫంక్షన్ హాల్‌లో జరిగిన వైఎస్సార్‌సీపీ పట్టణ 5వవార్డు ఇన్‌చార్జ్ టీ పార్వతీశ్వర్‌రెడ్డి కుమారుడు వివాహానికి హాజరై వధూవరులు కిషోర్ రెడ్డి, దీప్తిని ఆశీర్వదించారు. అంతకుముందు రిసెప్షన్ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత

యల్లనూరు: మండలంలోని గడ్డం వారిపల్లి క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో తరలిస్తున్న 19 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. బియ్యంతో పాటు కటిక శివ కుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంపై హర్షం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

పామిడి: 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన సిందూర్ ఆపరేషన్ సక్సెస్ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సోము వీర్రాజు విచ్చేశారు. ఈ సందర్భంగా ఇండియా-పాక్ యుద్ధానికి సంబంధించి ఆపరేషన్ సిందూర్ సక్సెస్‌పై ఆయన సమీక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### రామస్వామి దేవాలయాన్ని పునర్నిర్మించాలి

గుత్తి: గుత్తి కోటలోని పురాతన, పవిత్రమైన రామస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకుందని ఆలయాన్ని పునర్ నిర్మించాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు రామస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. జిల్లా పర్యటనలో భాగంగా గుత్తికి సోము వీర్రాజు వచ్చారు. ఈ సందర్భంగా రామస్వామి ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద్, రమేష్, రామకృష్ణ, చౌదరి, బీజేపీ నాయకులు తిమ్మారెడ్డి, మనోహర్, వెంకప్ప, ఆదినేని రామాంజి, హాసన్ బాషా తదితరులు కలిసి రామస్వామి దేవాలయాన్ని పునర్ నిర్మించాలని విన్నవించారు. అందుకు సోము వీర్రాజు సానుకూలంగా స్పందించారు.

### అంత్యక్రియలకు ఆర్థిక సాయం

పామిడి: పట్టణ పదో వార్డుకు చెందిన బోయ మునీంద్ర ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. పేద కుటుంబానికి చెందిన మునీంద్ర అంత్యక్రియల నిమిత్తం పామిడి యువత రూ.10 వేలు ఆర్థికసాయాన్ని మృతుడు తల్లి లక్ష్మమ్మకు అందించి మానవత్వాన్ని చాటారు.

# కల సాకారమయ్యేనా?

- ప్రతిపాదనలకే పరిమితమైన మున్సిపాలిటీలో విలీనం
- మౌలిక వసతులు లేక గన్నెవారిపల్లి కాలనీవాసుల అవస్థలు



డ్రైనేజీ దెబ్బతినడంతో రోడ్డుపైకి వస్తున్న మురుగు



సిమెంట్ రోడ్డు వేసినా డ్రైనేజీ ఏర్పాటు చేయని దృశ్యం

తాడిపత్రి రూరల్: తాడిపత్రి పట్టణంలో గన్నెవారిపల్లి కాలనీ కలిసిపోయింది. పట్టణంలో కంటే గన్నెవారిపల్లి కాలనీలోనే ఎక్కువగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలు విల్లాలు ఉండగా మరి కొన్ని కడుతున్నారు. వివిధ రకాల వాహనాల డీలర్ల షోరూంలు వెలిశాయి. పంచాయతీకి ఆదాయం కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. కానీ మౌలిక సదుపాయాలు మాత్రం అంతంత మాత్రమే. పెరుగుతున్న ఆదాయానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలన్న ఉద్దేశంతో కొందరు నాయకులు తాడిపత్రి మునిసిపాలిటీలో గన్నెవారిపల్లి కాలనీకి విలీనం చేసేందుకు ప్రయత్నించారు. ఈ విషయాన్ని 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ప్రతిపాదనలు ఆమోదించే సమయంలో ప్రమాదవశాత్తు వైఎస్సార్ దుర్మరణం పొందారు. తదనంతరం అధికారం చేపట్టిన ముఖ్యమంత్రులు పట్టించుకోకపోవడంతో ప్రతిపాదనలను అటకెక్కాయి.

### అరకొరగా మౌలిక సదుపాయాలు

గన్నెవారిపల్లి కాలనీలో దాదాపు 15 వేల మంది జనాభా ఉన్నారు. తాడిపత్రి మండల సరిహద్దులోని వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలంలోని గండికోట ప్రాజెక్టు భూ నిరాశ్రయులు గన్నెవారిపల్లి కాలనీకి వలస వచ్చారు. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లోని అల్ట్రాటెక్, అర్జాస్ స్టీల్ ప్లాంట్‌తో పాటు వందలాది గ్రానైట్, బండలపాలీసు యూనిట్లల్లో ఉపాధి పొందుతున్నారు. వీరందరికీ గన్నెవారిపల్లి కాలనీ ఆశ్రయం కల్పించింది. వీరికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారు. ప్రధానంగా నీటి సమస్య ఉంటోంది. పక్కన ఉన్న మునిసిపాలిటీలో రోజు మార్చి రోజు తాగునీరు వస్తుండగా కాలనీలో ఎప్పుడు వస్తాయో, ఎంత సేపు వస్తాయో తెలియని పరిస్థితి. నీటి కోసం పలువురు మునిసిపల్ కొళాయిలపై ఆధాపడుతున్నారు. కాలనీలో రోడ్ల సమస్య ఎక్కువగా ఉంది. రోడ్లు ఉన్న చోట మురికి కాలువలు ఉండవు. డ్రైనేజీ ఉన్నచోట రోడ్లు లేవు. దీంతో మురికి కుంటలు ఏర్పడి కాలనీ అంతా దుర్వాసన వస్తోంది. పూర్తి స్థాయిలో చెత్త తొలగింపు జరగడం లేదు. ఎక్కడ పడితే అక్కడ చెత్త ఉంటోంది. కొన్ని చోట్ల డ్రైనేజీలు దెబ్బతినడంతో మురుగు మట్టి రోడ్లపైకి వస్తోంది. అడ్డదిడ్డంగా ఇళ్ల నిర్మాణం జరగడం వల్ల మౌలిక సదుపాయల కల్పనలో ఇబ్బందులు కలుగుతున్నాయని పంచాయతీ అధికారులు చెపుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.



తాడిపత్రి మునిసిపాలిటీ, గన్నెవారిపల్లి కాలనీని వేరుచేస్తున్న రోడ్డు ఇదే..

### కాలనీని మునిసిపాలిటీలో చేర్చాలి

పట్టణంలో కలిసిపోయిన గన్నెవారిపల్లి కాలనీని తాడిపత్రి మునిసిపాలిటీలో చేర్చాలి. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి మునిసిపాలిటీలో కలపడమే మేలు. మౌలిక సదుపాయలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించాలి

– చిరంజీవి, సీపీఐ పట్టణ కార్యదర్శి



### ప్రతిపాదనలు పంపుతాం

గన్నెవారిపల్లి కాలనీని తాడిపత్రి మునిసిపాలిటీలో కలిపేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే అందుకు సంబంధించి ప్రతిపాదనలు పంపుతాం. ఇప్పటికే గన్నెవారిపల్లి కాలనీ పట్టణంలో కలిసిపోయింది. గతంలో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చి ఉంటే అప్పట్లో ఏం జరిగిందో పరిశీలిస్తా.

– శివరామక్రిష్ణ, మునిసిపల్ కమిషనర్, తాడిపత్రి



## కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



గజరాంపల్లిలో కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

పామిడి: మండలంలోని గజరాంపల్లిలో ఉన్న ఆర్డీటీ స్కూల్‌లో ఏపీ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కౌలు రైతుల గ్రామ సంఘం సమావేశం నిర్వహించారు. ఆ సంఘం నాయకులు వెంకటేశు, రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు బాలరంగయ్య, మల్లేసు మాట్లాడారు. లక్షల్లో పెట్టుబడి పెట్టి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్న కౌలురైతులను ఆదుకోవాలన్నారు. కౌలురైతులను గ్రామసభల ద్వారా గుర్తించి సీసీఆర్సీ కార్డులు మంజూరుచేసి అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20వేలు ప్రభుత్వం చెల్లించాలన్నారు. 90శాతం సబ్సిడీతో వేరుశనగ వత్తనకాయలు, ఎరువులు, పురుగుల మందులు ఇవ్వాలన్నారు. అలాగే ఆత్మహత్యలకు పాల్పడ్డ కౌలురైతు కుటుంబాలకు రూ.10 లక్షలు పరిహారం అందజేసి ఆదుకోవాలన్నారు. ఈ నెల 11న కౌలురైతుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఛలో అమరావతి కార్యక్రమానికి మండలంలోని కౌలురైతులు పెద్దెత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, పెద్ద ఎర్రిస్వామి, రామాంజనేయులు, పెద్ద లాలన్న, సుమతి, మారెన్న, రంగనాయకులు, మహేష్, సురేంద్ర, శివ, నారాయణ, రామచంద్ర, సుధాకర్, కౌలురైతులు పాల్గొన్నారు.

## ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలి

- తలారి రంగయ్య పాదయాత్రలో గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



తలారి రంగయ్యతో కలసి పాదయాత్ర చేస్తున్న వైవీఆర్

గుంతకల్లు టౌన్: నిత్యం కరువు కాటకాలతో సతమతమవుతున్న ఉమ్మడి జిల్లాలో పేదరిక నిర్మూలనకు కృషి చేయడంతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలోని పలు ప్రాంతాల్లో విస్తృత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆర్డీటీకి విదేశీ నిధులు సమకూరేలా ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. 'సేవ్ ఆర్డీటీ' పేరుతో వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్ర ఆదివారం శెట్టూరు మండలం కైరేవు, చెర్లోపల్లి గ్రామాల్లో కొనసాగింది. పాదయాత్రలో వై.వెంకట్రామిరెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. అంతకు ముందు ఆర్డీటీ వ్యవస్థాపకులు డాక్టర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్టిన నిబంధనల కారణంగా విదేశీ నిధులు ఆగిపోవడంతో ఆర్డీటీ సేవా కార్యక్రమాలు సైతం ఆగిపోయే పరిస్థితి నెలకొందన్నారు. మారుమూల పల్లెల్లోని ప్రజలకు విద్య, వైద్యం, సొంతిళ్ల నిర్మాణంతో పాటు క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న ఆర్డీటీని నిర్వీర్యం చేయడం మంచిది కాదన్నారు. ఈ విషయంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు మాట్లాడి, ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ అయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైవీఆర్‌తో పాటు గుంతకల్లుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత దశరథరెడ్డి, మాజీ సర్పంచ్ తిక్కస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పంటల సాగులో వైవిధ్యత చూపాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నారాయణస్వామి

శింగనమల: పంటల సాగులో రైతులు వైవిధ్యత చూపాలని రేకుల కుంట శాస్త్రవేత్త నారాయణ స్వామి సూచించారు. మండలంలోని నాయనవారిపల్లి, రాచేపల్లి గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయలో అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు , పురుగు మందులకు స్వస్తి పలికి, కొత్త పద్ధతులను అవలంభించాలన్నారు. నూతన పద్ధతులు, వంగడాల విషయాలు, డ్రోన్ స్ప్రేయింగ్ అంశాలపై వివరించారు. పంటల సాగులో అనువైన విత్తనాలు, రకాలు వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు సూచనలు పాటించాలన్నారు. పంట సాగుకు ముందు పచ్చ రొట్టి ఎరువులు వేయడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త కిశోర్‌రెడ్డి, పశు వైద్యాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, ఏఓ అన్వేష్‌కుమార్, ఎఈఓలు అక్కమ్మ, విశ్వేశ్వరి, రైతు సేవా కేంద్రం సిబ్బంది నాగశేషు, రాజేశ్వరి, పవన్‌కుమార్, విజయ్, ఫయాజ్, ఉమాదేవి, సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.

## కొండమీద రాయుడికి ప్రత్యేక పూజలు



కొండమీద రాయుడు



శనీశ్వరుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సిద్దరాంపురం రోడ్డు సమీపాన దేవర కొండపై వెలసిన కొండమీద రాయుడి ఆలయంలో అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారికి అర్చనలు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా దేవర కొండ కింద ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన శనీశ్వరుడి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో ప్రధాన అర్చకుడు బాబా మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుంకుమ అభిషేకం అర్చనలు, తైలాభిషేకం చేసి పూజలు నిర్వహించిన మొక్కులు తీర్చుకున్నారు

## పొంచి ఉన్న ప్రమాదం



రైల్వే మోరీలో ఫుట్‌పాత్‌పై వదిలేసిన సిమెంట్ దిమ్మెలు

గుంతకల్లు: స్థానిక సత్యనారాయణ పేటలోని రైల్వే మోరీ (గుంతకల్లు-గుత్తి రైలు మార్గం)లో రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారులు ఆదమరిస్తే ప్రమాదంలో చిక్కుకుంటారు. అసలే ఇరుకైన మోరీ కావడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ కావడం ఇక్కడ మామూలే. అయితే రైల్వే మోరీ గుండా మురుగు నీరు వెళ్లడానికి కాలవ నిర్మించి, దానిపై పాదచారులు వెళ్లాడానికి సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేసి ఫుట్‌ఫాత్ ఏర్పాటు చేశారు. ఇటీవల కాలవ శుభ్రం చేయడంలో భాగంగా మోరీలోని ఫుట్‌పాత్‌పై రెండు చోట్ల సిమెంట్ దిమ్మెలు తీసి ఫుట్‌పాత్‌పై అలాగే వదిలివేశారు. దీంతో ఈ రెండు చోట్ల కాలవ ఓపెన్‌గా ఉంది. ఆదివారం సాయంత్రం గుంతకల్లులో కురిసిన చిన్నపాటి వర్షానికి అసలే లోతట్టుగా ఉండి ఇరుకుగా ఉన్న మోరీలో మురుగు ఉధృతంగా పారుతుంది. దీనికి తోడు ఫుట్‌పాత్‌పై రెండు ఓపెన్‌గా ఉన్న ప్రాంతం నుంచి మురుగు బయటకు వస్తుంది. అయితే అక్కడ ఓపెన్ ఉన్న విషయాన్ని ద్విచక్రవాహదారులు, పాదచారులు గమనించకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మున్సిపల్ అధికారులు స్పందించి ఫుట్‌పాత్ వదిలివేసిన సిమెంట్ దిమ్మెలను కాలవపై కప్పి వేయాలని ప్రజలు, వాహనదారులు కోరారు.

### మెరుగైన సేవలందించాలి



క్షతగాత్రులను పరామర్శిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం మెడికల్: గార్లదిన్నె మండలం తిమ్మంపేట వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆదివారం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికందే సేవల్లో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఆర్థో హెచ్ఓడీ డాక్టర్ ఆత్మారాం తదితరులు పాల్గొన్నారు.

### లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని తిమ్మంపేట గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివా రం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి లారీ డ్రైవర్ బాషాపై కేసు నమోదు చేశామని జమేదార్ నరేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం చింతమణి నుంచి టమాట లోడ్‌తో ఉత్తరప్రదేశ్‌కు వెళ్తున్న లారీ తిమ్మంపేట సమీపంలోకి రాగానే ముందర కూలీలతో వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొనడంతో ఒక మహిళా కూలీ మృతి చెందగా, 22 మంది కూలీలకు గాయాలయ్యాయన్నారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ బాషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గాయపడిన ఈరమ్మ, నాగలక్ష్మి పరిస్థితి విషమంగా ఉండంతో సవీరా ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు.

### వైద్య శిబిరానికి స్పందన

యాడికి: మండల కేంద్రంలోని ప్యారడైజ్ స్కూల్లో ఆదివారం తినునాంపల్లికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కోనా విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో అనంతపురం శాన్విక చెస్ట్ అండ్ అలర్జీ కేర్ ఆస్పత్రి డాక్టర్ కోనా మురళీధర్‌రెడ్డి, వైద్య బృందం ఉచిత ఊపిరితిత్తుల వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి హాజరైన 82 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. యాడికి లయన్స్‌క్లబ్, మే ఐహెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు ధృవనారాయణ, బాలకృష్ణ రోగులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

శింగనమల: శింగనమలలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన శాంతిరాం హాస్పటిల్ వైద్యులు ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో దాదాపు 110 మందికి పరీక్షలు నిర్వహించి, 50 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ గవర్నర్ సుబ్బరామయ్య, జోన్ చైర్మన్ నాగేంద్రగుప్త, చంద్రశేఖర్, మురళి, రంగస్వామి, శంకర గుప్త, జే.శేషయ్య, పార్థసారధి, ఆదిశేషయ్య, నాగరాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గుత్తి: గుత్తి శివారులోని అనంతపురం రోడ్డులో ఆదివారం సారాను బైక్‌లో అక్రమంగా తరలిస్తుండగా ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. తుగ్గలి మండలం జొన్నగిరి తండాకు చెందిన సోమ్లానాయక్ సారాను అక్రమంగా తరలిస్తుండగా పోలీసలు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. హోండా యాక్టివాను సీజ్ చేశారు. ర్యక్రమంలో సీఐ ఉమాదేవి, ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుళ్లు వెంకట నారాయణ, వెంకటేష్, కానిస్టేబుల్ శివయ్య పాల్గొన్నారు.

### 'నిందితులను కఠినంగా శిక్షించాలి'

గార్లదిన్నె: సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో దళిత బాలికపై సామూహిక అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అనంతపురం డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు లోలూరు కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తండ్రి లేని దళిత బాలికపై అత్యాచారం చేయడం దారుణమన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించాలన్నారు.

### ద్విచక్ర వాహనాల ఢీ

- ఇద్దరికి గాయాలు

పామిడి: మండలంలోని కాలాపురం గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఘటనలో ఓబులాపురం గ్రామవాసి నెట్టికల్లు, గజరాంపల్లివాసి రాజుకు స్వల్ప గాయాలయ్యాయి.



గుత్తిలో రెండున్నర దశాబ్దాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు



పెద్దవడుగూరులో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ హైస్కూల్లో 1999–2000లో చదువుకున్న విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాల వేదికగా కలుసుకున్నారు. అప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులు సామ్ నథానియేల్, విజయ శేఖర్, రాజేంద్ర ప్రసాద్, బాల శౌరి, కిరణ్, గ్రేస్ రూబిక, నిర్మల, కమిలిని సత్కరించారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 2005–06లో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు.